
సభతో గులాబీ శ్రేణుల్లో జోష్..

ఎల్కతుర్తి సభ గులాబీశ్రేణుల్లో జోష్ నింపింది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితల సతీష్‌కుమార్ నేతృత్వంలో ఎల్కతుర్తి వద్ద భారీగా ఏర్పాట్లు చేశారన్న పేరొచ్చింది. సభకు వచ్చే వారికి ఎక్కడ కూడా లోటు లేకుండా సరిపడా నీళ్లు, మజ్జిగతో పాటు కొందరికి సమోసలు, బిస్కెట్లు కూడా అందించటం క్యాడర్‌ను ఆకట్టుకుంది. ఎండాకాలం కావడంతో చల్లగా ఉండేందుకు డ్రమ్ముల్లో ఐస్ వేసి అందులో నీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు ఉంచారు. సభావేదికతో పాటు లైట్లు, కుర్చీలు, బారికేడ్లు తదితర ఏర్పాట్లలో బాధ్యతలు తీసుకున్న గులాబీ నేతలు సక్సెస్ అయ్యారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక జనసమీకరణ కూడా ఆశించిన స్థాయిలోనే జరిగిందనే చర్చ పార్టీ నేతల్లో వ్యక్తమైంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో కొందరు ఇన్‌చార్జ్‌లు జనసమీకరణపై పెద్దగా దృష్టి పెట్టలేదని, సొంత పబ్లిసిటీకి ఇచ్చిన ప్రాధాన్యం.. జనసమీకరణకు ఇవ్వలేదని, అలాగే పార్టీ నుంచి వచ్చిన ఫండ్ కూడా సక్రమంగా ఖర్చవలేదన్న చర్చ కూడా పార్టీలో జరుగుతోంది. ఫలితంగా కొన్ని నియోజకవర్గాల నుంచి అనుకున్న స్థాయిలో జనసమీకరణ జరగలేదని ఆపార్టీ శ్రేణుల్లోనే చర్చ మొదలైంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడటం కూడా కొంత జనసమీకరణకు ఆటంకం కలిగినట్టుగా భావిస్తున్నారు. వరుస ఓటములతో డీలా పడిన క్యాడర్‌లో ఉత్సాహం నింపేందుకు గులాబీ నేతలు ఎక్కువగానే చెమటోడ్చారనే చర్చ జరుగుతోంది.



ఏదీ మునుపటి.. వాడీవేడి?

రజతోత్సవ సభలో కానరాని కేసీఆర్ మ్యాజిక్

- ప్రసంగంలో పదును, పంచ్‌లు తగ్గాయంటూ చర్చ
- సీఎం రేవంత్ పేరు ఎత్తని గులాబీ బాస్
- స్క్రిప్టు చదవడంపైనా సొంత పార్టీలోనే గుసగుసలు
- సభ సక్సెస్ అయినా.. అధినేత నిరాశపరిచారంటూ వ్యాఖ్యలు
- వరుస ఓటముల్లో ఉన్న శ్రేణులకు కొత్త భరోసా కరువు
- వందల మంది నేతలున్నా ఒక్కరికీ మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై అసంతృప్తి
- జనసమీకరణలో శ్రమించి.. సక్సెస్ అయిన ఉమ్మడి జిల్లా నేతలు
- ఏర్పాట్లు, సౌకర్యాలతో క్యాడర్ ఖుషీ ఖుషీ
- మావోయిస్టులతో శాంతి చర్చల తీర్మానం పార్టీకి కలిసొస్తుందని ఆశాభావం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఉద్యమనేపథ్య సభలో అయినా.. ఎన్నికల ప్రచారపర్వమైనా.. విలేక రుల సమావేశమైనా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం అంటే అందరికీ గుర్తొచ్చేవి ఆయన వేసే పంచులు.. చెప్పే ప్రాసలు.. పిట్టకథల రూపంలో ఎదుటి వాళ్లపై వేసే సెటైర్లు. అందుకే ఆదివారం ఎల్కతుర్తి వేదికగా జరిగిన ఆ పార్టీ ఆవిర్భావ సభలో ఆయన చేసే ప్రసంగం కోసం అందరూ ఎదురుచూశారు. కానీ ఈ రజతోత్సవ సభలో ఆయన మార్క్ మ్యాజిక్ కనిపించలేదు. మాటలో పదును.. ప్రత్యర్థులపై పంచ్‌ల జాడలేదు. ఎప్పుడు మాట్లాడినా.. ప్రత్యర్థిపై తనదైన శైలిలో వ్యాఖ్యలు చేసే కేసీఆర్.. పాతికేళ్ల సంరంభంలో 52నిమిషాల పాటు మాట్లాడినా.. ఎక్కడా సీఎం రేవంత్‌రెడ్డి పేరెత్తక పోవటం చర్చనీయాంశంగా మారింది. ఈ సభ ద్వారా కేసీఆర్ మాట తీరులో మార్పు చూశామని.. పైగా మాటల మాంత్రికుడిగా పేరున్న ఆయన ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చూసి ప్రసంగించటం ఏంటనే చర్చ సొంతపార్టీలోనే జరుగుతోంది. ఇక కార్యకర్తలు ఈలలు వేస్తూ.. కేరింతలు కొట్టినా.. సభలో సందడి చేసినా.. గులాబీబాస్ మాత్రం తన ప్రసంగంతో మంత్రముగ్ధులను చేయలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే సుమారు నెలరోజులుగా సభకోసం విస్తృత ఏర్పాట్లు చేయటంతో పాటు జనసమీకరణలో విజయం సాధించిన ఓరుగల్లు నేతలు సభను సక్సెస్ చేశారని, కానీ అధినేత ప్రసంగంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తకావడం కాస్త ఇబ్బందిగా ఉందని ఆపార్టీ శ్రేణులే వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. అయితే మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని తీర్మానం చేయడం ప్రతిపక్షంగా తమకు కలిసి వస్తుందనే చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతోంది.

కేసీఆర్ మాటల మ్యాజిక్ ఏదీ?

రజతోత్సవ సభ నిర్వహణను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల తరువాత భారీ బహిరంగ సభ వేదిక ద్వారా ప్రతిపక్ష నేత కేసీఆర్ ప్రజల ముందుకు వస్తుండటంతో అదే స్థాయిలో పబ్లిసిటీ కూడా జరిగింది. మాటల మాంత్రికుడిగా.. తన వాగ్దాటితో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తారన్న పేరున్న నేతగా కేసీఆర్‌కు గుర్తింపు ఉండటంతో రజతోత్సవ సభలో ఆయన ప్రసంగం కోసం ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చూశారు. కానీ ఆయన మాటల్లో చమక్కులు,

మిగతా 7వ పేజీలో..

సమగ్ర వివరాలతో భూ ఆధార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

- భూముల పరిరక్షణకు ప్రభుత్వం కృషి
- భూ భారతిలో శాశ్వత పరిష్కారాలు
- కలెక్టర్ రాహుల్ శర్మ

మహదేవపూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం ద్వారా భూములకు రక్షణ కలుగుతుందని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఇందులో భాగంగా భూముల సమగ్ర వివరాలతో భూఆధార్ కార్డులను జారీ చేస్తామని అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన భూ భారతి అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజర య్యారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టం, ధరణి చట్టం మధ్య వ్యత్యాసాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూ సమస్యలు పరిష్కరించడానికి పకడ్బందీ చట్టాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం అన్ని జిల్లాల్లో రైతులు, మేధావులు, ప్రజల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుందని తెలిపారు.ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న చట్టాలను కూలంకషంగా అధ్యయనం చేసి ఈ నెల 14న అమల్లోకి తెచ్చిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో 12 మండలాల్లో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో జిల్లాలోని ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతు సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూ భారతి ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ధరణిలో ఏదైనా పొరపాటు జరిగితే సరిచేసుకునే అవకాశం లేదని, సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఈ సదస్సులో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి శ్రీపాల్, నాయబ్ తహసీల్దార్, కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతుల సమర్పణ



ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో ఏవోకు వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ జరిగింది. గిరిజనులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ ఏవో రాజ్‌కుమార్‌కు వినతులు సమర్పించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం ఐదుగురు గిరిజనులు తమ సమస్యలను ఏవో దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ ఏరియాలో మత్స్య సొసైటీలు ఏర్పాటు చేయాలని ఏటూరునాగారానికి చెందిన సిద్దబోయిన సురేందర్, ఆలం భాస్కర్ కోరారు. తన భర్త పేరు మీద ఉన్న భూమిని గ్రామంలోని కొందరు ఆక్రమించుకున్నారని, దానిని పరిరక్షించాలని మంగపేట మండలం రమణక్కపేటకు చెందిన పడిగ సంధ్యా మొరపెట్టుకుంది. తన అకౌంట్‌లో ఉన్న డబ్బులను తీసుకొనేందుకు అనుమతి ఇవ్వాలని గంగారం మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన ప్రశాంత్ వినతి పత్రం అందించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రేగొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : తాటి చెట్టు పైనుంచి పడటంతో గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని రూపిరెడ్డిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగపురి లింగయ్య ఉదయం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో జారి కింద పడిపోయాడు. దీంతో మోకాలు వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

రజతోత్సవ సభ చారిత్రకం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

- దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్వహణ
- అధికార పార్టీ అడ్డంకులు సృష్టించినా సక్సెస్
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో ఆది వారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ చారిత్రకమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాల యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరు ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం లో ఎక్కడా లేని విధంగా ఒక రాజకీయ పార్టీ ఇంత పెద్ద సభను నిర్వహించడం ఇదే తొలి సారి అని అన్నారు. అధికార పార్టీ అడుగడు గునా అడ్డంకులు సృష్టించినా ప్రజలు, బీఆర్ ఎస్ కార్యకర్తలు విజయవంతం చేసి చూపించారని అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంతో పాటు మంథని, చెన్నూరు, పరకాల నియోజకవర్గ ప్రజల వాహనాలను ఉద్దేశ పూర్వకం గా అడ్డుపడ్డారని విమర్శించారు. అధికారం లోకి రావడానికి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చిందని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టేసి హామీ ఇచ్చిన నేతగా రేవంత్‌రెడ్డి రాజకీయ చరిత్రలో నిలిచారని వ్యాఖ్యానించారు. అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతి రేకత మొదలైందని, ఇప్పటికైనా కళ్లు తెరిచి సరిదిద్దుకోవాలని డిమాండ్ చేశారు. ఇక రాబోయే ఎన్నికలేవైనా బీఆర్ఎస్‌దే గెలుపని, ప్రజలు ప్రస్తుత ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ యాదవ్, మునిసిపల్ మా జీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దార పూలమ్మ, నూనె రాజు, జక్కం రవికుమార్, మంగళపల్లి తిరు పతి, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి, నాయకులు సెగ్గం సిద్దు, పోల్సాని లక్ష్మీనరసింహరావు, కటకం జనార్ధన్, బీబీచారి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు రాష్ట్ర స్థాయి రివార్డు



రివార్డును అందుకుంటున్న కానిస్టేబుల్ రాజు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖలోని సీసీఎస్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉప్పాల రాజుకు రాష్ట్ర స్థాయి రివార్డు దక్కింది. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం సమర్థంగా సేవలు అందించినందుకు పోలీసు శాఖ ఆయనకు ఉత్తమ బహుమానాన్ని అందించింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్, అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ చేతుల మీదుగా రాజు ఈ రివార్డును అందుకున్నారు.

'సహకార' సేవలకు కొత్త రూపు

- ఇక రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా పీఏసీఎస్‌లు
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం సరికొత్త నిర్ణయం
- తొలి విడతలో గారెపల్లి(కే), మహాముత్తారం, చెల్పూరు, మొగుళ్లపల్లి సొసైటీలకు గుర్తింపు
- సన్నకారు రైతులకు మేలు కలిగేలా చర్యలు



పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం



కాటారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

కాటారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చిన్న, సన్నకారు రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఇందులో భాగంగా దశాబ్దాలుగా చెలామణిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కార్యకలాపాలకు కొత్త రూపం ఇవ్వనున్నాయి. పీఏసీఎస్‌లు రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో)గా సేవలు అందించనుంది. రైతులకు మార్కెట్ కనెక్టివిటీ, ఉత్పత్తి చేసిన పంటల విలువ ఆధారిత సేవలను పెంచడం, నూతన సాంకేతిక సహాయం అందేలా చూడ్డం తదితర సేవలను సమర్థంగా నిర్వర్తించాలన్నదే దీని ముఖ్యోద్దేశం.

ఇతర రాష్ట్రాల్లో ప్రైవేట్ రంగంలో ఎఫ్‌పీవోలుగా రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వేలాది మంది రైతులు ఉండే పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా మార్చాలని కేంద్రాన్ని కోరింది. దీనిపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, సహకార మంత్రిత్వ శాఖ సుముఖత వ్యక్తం చేసింది. సహకారం రంగంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సాహించడానికి చర్యలు చేపట్టింది. దీంతో పీఏసీఎస్‌లను రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో)లుగా గుర్తిస్తూ కేంద్రం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. తొలి విడతలో కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఎఫ్‌పీవోలుగా మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో రైతులను సంఘటితం చేసి వారి అభివృద్ధితో పాటు సంఘాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేయనున్నట్లు సహకార శాఖ అధికారులు తెలిపారు.

ఎఫ్‌పీవోలుగా నాలుగు పీఏసీఎస్‌లు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి చిన్న, సన్నకారు రైతులను మరింతగా ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలోని 10 పీఏసీఎస్‌ల్లో తొలి విడతలో నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎఫ్‌పీవోలుగా మారాయి. ఇందులో కాటారం డివిజన్ పరిధిలోని గారెపల్లి(కే), మహాముత్తారం పీఏసీఎస్‌లతో పాటు భూపాల పల్లి డివిజన్ పరిధిలోని చెల్పూరు, మొగుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎఫ్‌పీవోలుగా రూపాంతరం చెందాయి. మరో రెండు విడతల్లో మిగతా పీఏసీఎస్‌లు సైతం ఎఫ్‌పీవోలుగా మారనున్నాయి. పీఏసీఎస్‌లలో జరుగుతున్న లావాదేవీలు, రైతులకు అందుతున్న సేవలపై ఆడిట్ చేసి అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా మొదటి విడతలో నాలుగు పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా గుర్తిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో జిల్లాలోని రైతులు సహకార శాఖ అధికారుల సహకారంతో తమ పంట ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి, విలువ పెంచుకోవడానికి అవకాశం కలగనుంది.

ఎఫ్‌పీవోలు.. ప్రయోజనాలు

రైతుల ఆదాయం మరింతగా పెంచడం, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడం, తద్వారా గ్రామీణ ఆర్థిక

మిగతా 8వ పేజీలో...

కొవిడ్‌కు పూర్వం ఉన్నరైళ్లను పునరుద్ధరించాలి

డోర్నకల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్‌కు పూర్వం నడిచిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనంపాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఖమ్మంలోని స్థానిక పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి-మణుగూరు ఎక్స్‌ప్రెస్, పెద్దపల్లి- విజయవాడ పాసింజర్, కాజీపేట-డోర్నకల్-విజయవాడ పుష్‌పుల్, కాజీపేట-మణుగూరు, మణుగూరు -కాజీపేట పాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. రైల్ రద్దుతో సామాన్య ప్రజలు ముఖ్యంగా చిరు వ్యాపారులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశామని, అయి నప్పటికీ వారిలో స్పందన లేదని చెప్పారు. ఇప్పటికైనా కొవిడ్‌కు ముందు రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని ఆయన కోరారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు 'సంకేపల్లి' దంపతులకు ఆహ్వానం



శ్రీనివాస్‌రెడ్డి కీర్తనారెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో మే 10, 11 తేదీల్లో జరుగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు కవి, రచయితలు సంకేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సంకెపల్లి కీర్తనారెడ్డి దంపతులకు సోమవారం ఆహ్వానం అందింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీవాస్తవ అధ్యాపకుడు, రచయిత శుభోదయం సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రచయిత్రి అమృదేవన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కీర్తనారెడ్డికి ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వానం అందడం పట్ల పట్టణానికి చెందిన కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

భూ భారతి పైలెట్ మండలంగా దంతాలపల్లి



భూభారతి సమావేశ వేదికను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దంతాలపల్లి మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలుకు పైలెట్ మండలంగా ఎంపిక చేయడం జరిగిందని తొర్రూరు ఆర్డీవో గణేష్ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్‌ను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ భూ భారతి రెవెన్యూ చట్టం అమలు తీరుపై మంగళవారం జరిగే అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్, ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ పాల్గొంటారన్నారు. తహసీల్దార్ సునీల్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, గిర్దావర్లు నజీముద్దీన్, రాజు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ అధికారుల ఒత్తిడిని తగ్గించాలి

- కలెక్టర్ దివాకరకు రైస్‌మిల్లర్ల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైస్‌మిల్లర్లు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లయ్ అధికారుల ఒత్తిడిని తగ్గించాలని న్యాయం చేయాలని కోరుతూ ములుగు కలెక్టర్‌ను రైస్‌మిల్లర్లు కోరారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో సభ్యులు కలెక్టర్ దివాకరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రబీసీజన్‌కు సంబంధించిన ధాన్యం నుంచి ఎఫ్‌సీఐకి బాయిల్డ్ బియ్యం మాత్రమే ఇచ్చేవారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యాన్ని పేదలకు ఇవ్వాలనే ఉద్దేశంతో బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని అన్నారు. అయితే ఇక్కడ పండే ధాన్యం బాయిల్డ్ బియ్యం అవుతాయని, రా రైస్ కావని అన్నారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ అధికారులు రా రైస్ పెట్టాలిసిందేనని ఒత్తిడి చేస్తున్నారని, తమ పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

» మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



భూ భారతి సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పెద్దవంగర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం పెద్దవంగర మండలకేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ భారతితో ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని, ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ గ్రామానికి వెళ్లి రైతులకు ఈ చట్టంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పెద్దవంగరలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధ్యానం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాలను అధికారులు పర్యవేక్షిస్తూ అలసత్వం వహిస్తున్న ఇన్‌చార్జిలపై చర్యలు తీసుకోవాలని, అదనీతికి పాల్పడితే సహించేది లేదన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్డీవో గణేష్, ఏడీ ఎస్‌ఎల్‌ఆర్ పి నరసింహ, డీసీఆర్‌వో రాజేం ద్రప్రసాద్, తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఏవో గుగులోతు స్వామినాయక్, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, జాటోత్ నెహ్రూనాయక్, శ్రీనివాస్, వెంకన్న, సీతారాం, లింగమూర్తి, ఉప్పలయ్య ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో పారదర్శక సేవలు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



పలిమెలలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం ద్వారా పారదర్శక సేవలు అందుతాయని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. పలిమెల మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతిపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ధరణిలో సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తుచేశారు. భూ భారతి చట్టంలో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి సమస్యలకు పరిష్కార మార్గం చూపుతారని అన్నారు. ప్రజలకు సులభతరమైన, పారదర్శకమైన చట్టం అందుబాటులోకి తెచ్చేందుకు నిపుణుల కమిటీ దేశవ్యాప్తంగా విచారణ చేశాకే నూతన భూ భారతిని ప్రవేశపెట్టారని తెలిపారు. మండల, జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యల కోసం ప్రత్యేక ట్రిబ్యునల్ ద్వారా ఉచిత న్యాయ సలహాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులను, సర్వేయర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

- రూ.60వేల అపహరణ

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలు ఓఇంట్లో దొంగలు పడి నగదు అపహరించిన ఘటన తొర్రూరు మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన మార్క పెద్దలక్ష్మయ్య ఇంట్లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.60వేల నగదు దొంగిలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



మంజునాథ్ (ఫైల్)

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓయువకుడు లారీ ఢీకొని మృతి చెందిన ఘటన తొర్రూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన రెయ్యల శ్రీమంజునాథ్(17) సోమవారం ఉదయం సోదరిని హైదరాబాద్ వెళ్లేందుకు తొర్రూరులో బస్సు ఎక్కించాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో పత్తేపురం గ్రామ శివారులో ఖమ్మం వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీమంజునాథ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు హుటాహుటిన 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. శ్రీమంజునాథ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుండగా, సెలవులు రావడంతో ఇంటికి వచ్చాడు. తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

అనారోగ్యంతో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడి కన్నుమూత

- బుచ్చిరెడ్డికి నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు



బుచ్చిరెడ్డి (ఫైల్)

బయ్యారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు రెంటాల బుచ్చిరెడ్డి(70) అనారోగ్యంతో ఆదివారంరాత్రి ఖమ్మంలో మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారానికి చెందిన ఆయన తొలుత న్యూడెమోక్రసీ పార్టీలో కొనసాగారు. తదనంతరం నాటి టీఆర్ఎస్ పార్టీలో చేరి తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. స్వరాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో పాల్గొన్న బుచ్చిరెడ్డిపై పలు రకాల కేసులు నమోదవడంతో జైలు జీవితం గడిపారు. కాలక్రమేణా వయోభారంతో పాటు గుండె సంబంధిత వ్యాధికి గురై అనారోగ్యంపాలైన బుచ్చిరెడ్డి కొంత కాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి ఖమ్మంలో నిషామమయ్యున్న తన కుమారుడు అశోక్‌రెడ్డి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. బుచ్చిరెడ్డికి భార్య ఉపేంద్ర, కుమారుడు అశోక్‌రెడ్డి, కూతురు శ్రీదేవి ఉన్నారు. సోమవారం బయ్యారంలో బుచ్చిరెడ్డి భౌతికకాయానికి పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మలిదశ ఉద్యమకారులు శంకర్‌రావు, రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, వీరభద్రం, లింగయ్య, వెంకటయ్య, వల్లయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, సీపీఎం నాయకులు, న్యూడెమోక్రసీ నాయకులు, మాస్‌లైన్ నాయకులు తదితరులు ఉన్నారు.





నిర్మానుష్యంగా భూపాలపల్లి చౌరస్తా, చలివేంద్రంలో నీళ్లు తాగుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భగ్గుమంటున్న భానుడు

ఎండలు రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతున్నాయి. వేసవి తాపంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బయట అడుగు పెట్టాలంటేనే హడలిపోతున్నారు. దీంతో భూపాలపల్లి జిల్లా కేంద్రం రోడ్లు మధ్యాహ్నం సమయంలో బోసిపోతున్నాయి. ట్రాఫిక్ లేక వెలవెలబోతున్నాయి. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రోడ్డు పక్కనే ఉన్న చలివేంద్రంలో ఇలా మంచినీళ్లు తాగి గొంతు తడుపుకున్నారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

ఖనిజ సంపదను దోచిపెట్టేందుకే ఆపరేషన్ కగార్

- కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి
- ఆదివాసీ, దళిత, గిరిజన, ప్రజా సంఘాల డిమాండ్



ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని నినాదాలు చేస్తున్న గిరిజన, ప్రజా సంఘాల నాయకులు

ములుగు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కర్రెగుట్టల్లోని ఖనిజ సంపదను ఆదానీ, అంబానీ వంటి పెత్తందారులకు దోచి పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపడుతోందని ఆదివాసీ, దళిత, గిరిజన సంఘాల సమన్వయ కమిటీ నాయకులు ఆరోపించారు. ములుగు జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకపు ఆదివాసీ ప్రజలపై జరుగుతున్న దాడిని ఖండిస్తున్నారు. మావోయిస్టులు పిలుపు మేరకు శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సొంత దేశం, సొంత ప్రజలపై కేంద్ర బలగాలను హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రయోగించడం హేయమైన చర్య అని విమర్శించారు. అమాయకపు ఆదివాసీలను చేసిన తప్పేమిటని మావోయిస్టులను, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ప్రజలు స్వేచ్ఛగా జీవించలేక పోతున్నారన్నారు. ఆదివాసీలకున్నా పరాయి దేశస్థులా? మన వ్యక్తికా శత్రువా? అని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల మాన, ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. 2026 మార్చి వరకు దేశంలో ఎక్కడా మావోయిస్టులు లేకుండా చేస్తామన్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పై కేసునమోదు చేయాలని డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో పర్యాటకులపై దాడి జరిగితే దేశం మొత్తం స్పందించిందని, అమాయకపు ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఖండించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కర్రెగుట్టలపై జరుగుతున్న దాడులపై సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జంతువులను చంపితేనే ఎన్నో కేసులు పెట్టే ఈ రోజుల్లో నిర్లక్ష్యంగా మానవుల ప్రాణాలు తీస్తుంటే కేంద్రం ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికే మావోయిస్టులు నాలుగుసార్లు శాంతి చర్చలకు రావాలని పిలుపునిచ్చాయని, కేంద్రం పునరాలోచించి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని అన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ, గొర్ల సభ, ఎమ్మార్పీఎస్, ట్రైబల్ ఫ్రంట్, గిరిజన సామాజిక, శాంతి చర్చల కమిటీ, ఎల్‌హెచ్‌పీఎస్ సంఘాల నాయకులు లక్ష్మయ్య, జైసింగ్ రాథోడ్, రామ్మూర్తి, పీరయ్య, ఉపేందర్, కిషన్ నాయక్, మంగీలాల్, భిక్షపతి, శ్రవణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సమ్మయ్య రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌పై వెనక్కి తగ్గేది లేదు..

» వచ్చే ఏడాది మార్చి 31వరకు తుడిచి పెట్టడమే బీజేపీ లక్ష్యం

» మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌పై వెనక్కి తగ్గేది లేదని, ఈ విషయంలో ఎవరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోబోమని కచ్చితంగా కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ వేలాది మంది అమాయక గిరిజనులను పొట్టనపెట్టుకుంటున్న మావోయిస్టు భీభత్సాన్ని బీజేపీ ఎప్పటికీ ఆమోదించదన్నారు. భారత్‌లో పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి 31 వరకు డెడ్‌లైన్ పెట్టిందని గుర్తు చేశారు. ఈ విషయంలో మావోయిస్టుల విశ్వాసం పొందేందుకు మాజీ సీఎం, సీఎం పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. భారత్ సరిహద్దుల్లోని ఉగ్రవాదుల దాడుల్లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు సైనికులతో పాటు సాధారణ పౌరులు 47,914 మరణిస్తే ఎప్పుడు నోరు మెదపని ప్రాంతీయ, జాతీయ పార్టీలు ఇప్పుడు దేశభక్తి ఉన్నట్లుగా నటిస్తూ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. 11 ఏళ్లలో 11 ప్రైనలు బీజేపీ ప్రభుత్వం ఇవ్వలేదని 10 ఏళ్లు సీఎంగా చేసిన కేసీఆర్ రజతోత్సవ సభలో మాట్లాడటం ఆయన అజ్ఞానాన్ని నిదర్శనమన్నారు. 2023 సంవత్సరంలో పార్లమెంట్ ఎన్నికలకు జరిగే నాటికి కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు 9లక్షల 72వేల కోట్ల నిధులు రావడం జరిగిందన్నారు.

మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంలో ఎంఐఎం అభ్యర్థి బరిలో ఉంటే ఏ పోటీ నుంచి బీఆర్ఎస్ ఎందుకు వైదొలిగిందని? బీఆర్ఎస్ ముస్లింలకు సపోర్ట్ చేస్తుందా.. హిందువులకు సపోర్ట్ చేస్తుందా.. తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. భారత్‌లో జరిగిన ఉగ్రవాద చర్యలను ప్రపంచంలోని దేశాలన్నీ ఖండిస్తే భారతదేశంలో ఉన్న కేసీఆర్ పాంహాకక్‌ను పరిమితిపై ఆదివారం జరిగిన రజతోత్సవ సభలో వారం రోజులకు స్పందించడం సిగ్గుచేటన్నారు. గిరిజన వర్సిటీకి 900 కోట్లు ఇచ్చిన విషయం నీకు తెలియదా.. వరంగల్ టూ భద్రాచలంకు 240 కోట్లతో రోడ్ల పనులు జరుగుతుంది తెలియదా...? స్మార్ట్ సిటీలో వరంగల్‌కు 1000 కోట్లు ఇచ్చింది తెలియదా... ఇవన్నీ తెలిసాకా మేడకాద్ మాటలు ఎందుకు మాట్లాడుతున్నావని మండిపడ్డారు. హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. తెలంగాణలో మహిళాక్కులుగా చూసుకునే ఆడపిల్లలను సభ వేదికగా కేసీఆర్ అవమానించడం సిగ్గు చేటని దీనిపై తక్షణమే రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించాలన్నారు. అమాయక ప్రజలను నక్సలైట్లు హత్యలు చేస్తున్నప్పుడు అధికారంలో ఉండి కూడా మాట్లాడని కేసీఆర్ ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ తొలిఉద్యమకారులైన కొండా లక్ష్మణ్‌బాపూజీ, జయశంకర్‌కు నివాళులు అర్పించకుండా, వారి పోటోలను పెట్టకుండా అవమానపరిచారని, కేవలం తండ్రి, కొడుకుల సభలాగా కొనసాగిందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, వరదాల కాళీప్రసాద్, కొండేటి శ్రీధర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్‌రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తారా కాలనీలో ఆదివారం రాత్రి క్షుద్రపూజలు కలకలం రేపాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అమావాస్య రోజున అర్ధరాత్రి కాలనీ సమీపంలోని మూడు కూడళ్ల మధ్య నిమ్మకాయలు, కొబ్బరికాయ, ఎర్రగా ఉన్న అన్నం, పాలు పెట్టారని చెబుతున్నారు. దీంతో కాలనీవాసులు ఎవరో క్షుద్రపూజలు చేసి ఉంటారని భయాందోళనకు గురవుతున్నారు.

వడదెబ్బతో రైతు మృతి



సారయ్య (ఫైల్)

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బ తో రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలగిరి గ్రామానికి చెందిన ఎన్నమాల సారయ్య(45) అనే రైతు తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించాడు. ఈ క్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ధాన్యం ఆరబెట్టి, తూర్పార పట్టారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సారయ్య ఒక్కసారిగా ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. భార్య, మృతుడికి భార్య రజిత, కుమారులు సాయిసిగ్నా, సాయివర్ధన్ ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. క్వింటాళ్లు)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2181	1521
పల్లికాయ (సూక)	5900	5200
పల్లికాయ (పచ్చిది)	4350	3575
కందులు	6052	3022
పెసళ్లు	6922	3022
పత్తి	7460	5300
పసుపు (కాడి)	14155	10534
పసుపు (గోల)	12509	9700
తేజ మిర్చి	13000	9500
డిడి	-	-
వండర్‌హాట్	11500	10000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	11500	9000
దీపిక	10500	10000
దేశీ	20000	18000
సింగిల్‌పట్టి	-	-
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

నాట్యం.. ఓరుగల్లు వారసత్వం

- కళల కాణాచిలో గుబాళిస్తున్న నృత్య సౌరభాలు
- గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్న బతుకమ్మ నృత్య రూపం
- పలు జాతీయ వేదికలపై వెలుగులీనుతున్న కళ

నేడు ప్రపంచ నాట్య దినోత్సవం



జాతీయ నృత్య కళా కారిణి హిమాన్సీ

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కళల కాణాచి, సాంస్కృతిక రాజధాని చారిత్రక ఓరుగల్లులో నాట్య సౌరభాలు గుబాళిస్తున్నాయి. కాకతీయుల సంగీత, సాహిత్య, శిల్ప, నృత్య కళలను పోషించిన విషయం తెలిసిందే. అనేక నాట్య శాస్త్ర భంగిమలను విభిన్న నాట్య రీతులను అనేక ఆలయాల్లో శిల్పాలుగా చెక్కించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భిన్న నృత్యాలు కాకతీయుల వారసత్వంగా కొనసాగుతూ వస్తున్నాయి. వారి కాలంలో పురుడు పోసుకున్న పేరిణి, జానపదం ముఖ్యంగా కూచిపూడి ఓరుగల్లు నేలపై నిత్యం తొణికిసలాడుతోంది. అంతేగాక ఓరుగల్లు నృత్యానికి అంతర్జాతీయ స్థాయిలో గిన్నిస్ బుక్‌లోనూ చోటు దక్కించుకోవడం అపూర్వ విషయమే. మంగళవారం ప్రపంచ నాట్య దినోత్సవం సందర్భంగా కథనం.

ఓరుగల్లు కళా సంస్థలు

వరంగల్‌లో టీవీ మాధ్యమ ప్రభావంతో నృత్యాలకు ఆదరణ పెరుగుతోంది. వరంగల్‌లో వందలాది మంది కళాకారులు జాతీయ వేదికలపై రాణిస్తున్నారు. పలు కళాక్షేత్రాలు, సంఘాలు కళాకారులను ప్రోత్సహిస్తున్నాయి. వరంగల్‌లో వెలిసిన వెంపటి నాగేశ్వరి నృత్య కళాక్షేత్రంతో పాటు బొంపెల్లి సుధీర్‌రావు నేతృత్వంలోని నృత్య మాల, శివానంద సద్గురు నృత్య కేంద్రం, తాడూరి రేణుక నాట్యా చారిణిగా నృత్య స్రవంతి, నృత్య రవళి పేరుతో పరమేశ్వర్ ఆధ్వర్యంలో నృత్య కళా సంస్థ, కుండె అరుణ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో హనుమకొండలో మయూరి నాట్య కళా కేంద్రం, రుద్ర వేణు, వానమామల కృష్ణ దేవ్, భ్రమరాంబ, నెహ్రూ యువ కేంద్రం, బాలభవన్ల ద్వారా ఝాన్సీ, కాట్రగడ్డ హిమాన్సీ చౌదరి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య రీతుల్లో టెంపుల్ డ్యాన్స్ పేరిట వందలాది మంది కూచిపూడి కళాకారులను తీర్చిదిద్దుతున్నారు. రమ్యమైన కళారూపాల్లో ప్రధానమైనది నృత్యమే. ఇందులో ఎక్కువ మందిని అలరింపజేస్తున్నది కూచిపూడే కావడం విశేషం. ప్రధానంగా నారాయణతీర్థులు రాసిన శ్రీకృష్ణ లీలా తరంగిణి, సంప్రదాయ సిద్ధమైన సిద్ధేంద్రయోగి, భామకలాపం, కూచిపూడి నాట్య విద్యలో బాలగోపాల తరంగం, దశావతార నృత్యం, అష్టపదులు లాంటి నృత్య రీతులను ఓరుగల్లు కళాకారులు ప్రధానంగా ప్రదర్శిస్తున్నారు. కాకతీయుల అపూర్వ చరిత్ర నృత్య రూపకాన్ని అన్ని కళా సంస్థల విద్యార్థినులు అద్భుతంగా ప్రదర్శిస్తూ అలనాటి ఓరుగల్లు కీర్తిని చాటుతున్నారు. ఓరుగల్లు నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన కళాకారుల సంఖ్య వందల్లోనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. కూచిపూడిలో శిక్షణ పొందడమే కాక డిప్లొమా, టీటీసీ కోర్సులను పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లను పొందుతున్న విద్యార్థుల జాబితా కూడా చాలా ఉంది.



శాంతికృష్ణను సత్కరిస్తున్న సినీ నిర్మాత దిల్ రాజు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, బండా ప్రకాశ్, జేడీ లక్ష్మీనారాయణ (ఫైల్)



అమెరికాలో ఓరుగల్లు కళాకారులు (ఫైల్)

గిన్నిస్ బుక్‌లో బతుకమ్మ నృత్య రూపం

డాక్టర్ శాంతికృష్ణ కళాకారుడిగా అంచెలంచెలుగా ఎదిగారు. ఓరుగల్లులోని వెంపటి కళాక్షేత్ర ఆచార్యుడు వెంపటి శ్రావణి హైదరాబాద్‌లో 500 మంది కళాకారులతో ప్రదర్శించిన బతుకమ్మ తల్లి జానపద నృత్యం గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది. వీరు ఇప్పటివరకు 11దేశాల్లో బతుకమ్మ తల్లి ప్రదర్శనలు ఇచ్చారు. గతేడాది మార్చి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు మలేషియా దేశంలోని కౌలాలంపూర్‌లో తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. 19మంది కూచిపూడి కళాకారులు ఇచ్చిన ప్రదర్శన ఆ దేశ ప్రధాని నుంచి ప్రశంసలందుకుంది. అమెరికాలోని వైట్‌హౌస్, దుబాయిలోని బుర్జ్ ఖలిఫా వేదికపై నృత్య ప్రదర్శన ద్వారా ఓరుగల్లు కీర్తిని చాటి చెప్పామన్నారు.

అద్భుత కళాకారులు

దశాబ్దం క్రితం సుధీర్‌రావు వద్ద నృత్యంలో ఓనమాలు నేర్చుకున్న హిమాన్సీ అనేక వేదికలపై అద్భుత ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్నారు. అలాగే టెంపుల్ డ్యాన్స్ పేరిట ప్రత్యేక ఆర్ట్ ఫామ్ తయారు చేయించి వందలాది శిష్యులకు ఈ విద్యను నేర్పిస్తోంది. నృత్య స్రవంతి ద్వారా తాడూరి రేణుక 1991లో తమ కేంద్రాన్ని ప్రారంభించి ఇప్పటి వరకు మూడు వేల మందికి శిక్షణ ఇచ్చినట్లు ఆమె చెప్పారు. చందన రాముల జాతీయ వేదికలపై మెరిసి.. లిమ్కా బుక్‌లో తన పేరును లిఖించారు. ఈటూరి అజయ్ కుమార్ కూచిపూడి నృత్యంలో పీహెచ్‌డీ పూర్తి చేసి యూజీసీ నుంచి జూనియర్ రిసెర్చ్ ఫెల్లోషిప్‌కు ఎంపికైనట్లు రేణుక చెప్పారు. అన్ని కళాసంస్థల విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లో జరిగే నృత్య పోటీల్లో పతకాలను సాధిస్తూ ఓరుగల్లు ఖ్యాతి చాటుతున్నారు. ఓరుగల్లులో ఏటా జరిగే అనేక సంప్రదాయ ఉత్సవాలు, ఆలయాలు, వినాయక చవితి పర్వదినాల్లో వేలాది మంది విద్యార్థులు తమ ప్రదర్శనతో సందడి చేస్తారు.



నృత్య ప్రదర్శనలో శ్రావణి, శాంతికృష్ణ (ఫైల్)



నృత్యకారిణి చందన

ఏదీ మునుపటి.. వాడీవేడి?

(5వ పేజీ తరువాయి)

వ్యంగాస్త్రాలు కనిపించకపోవటం వారిని నిరాశకు గురిచేస్తే.. రాసిచ్చిన స్క్రిప్టు చదవటం మరింత చర్చనీయాంశంగా మారింది. 52 నిమిషాలు మాట్లాడిన కేసీఆర్ ఒక్క కొత్త మాట మాట్లాడలేదని, కొత్త కార్యక్రమాలకు పిలుపునివ్వలేదని, ప్రత్యర్థులపై ఘాటైన విమర్శలు, పంచ్‌లు వేయలేదన్న అభిప్రాయాలు క్యాడర్‌లో వ్యక్తమవుతున్నాయి. వరంగల్ లాంటి ఉద్యమ గడ్డపై కేసీఆర్ స్పీచ్‌లో పంచ్‌లు లేకపోవటం హాట్‌టాపిక్‌గా మారింది. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో పాటే నడిచిన ఓరుగల్లుకు చెందిన ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు కాళోజీ తదితర దిగ్గజాల పేర్లు ప్రస్తావించకపోవడం శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రత్యర్థులపై వ్యంగాస్త్రాలతో దాడి చేయకపోవడంతో పాటు, సీఎం రేవంత్‌రెడ్డి పేరెత్తకుండా కేసీఆర్ ప్రసంగం సాగడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన సభలో కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఘాటైన వాఖ్యాలు చేశారు. వాటికి కేసీఆర్ దీటైన సమాధానం చెప్తారని గులాబీ శ్రేణులు ఆశించాయి. ఇక సభలో కాల్పుల విరమణపై తీర్మానం ఒక్కటే ప్రవేశ పెట్టారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఎలాంటి తీర్మానాలు కనిపించక పోవటం క్యాడర్‌లో చర్చకు దారితీసింది. వరుస ఓటములతో నిరాశలో ఉన్న క్యాడర్‌కు దిశ, దశ చూపించాల్సిన సమయంలో ప్రభుత్వంపై విమర్శలకే పరిమితమయ్యారనే చర్చ జరుగుతోంది. కేసీఆర్ ప్రసంగంలో పదును తగ్గటానికి పరిస్థితుల కారణమా.. ఆరోగ్య కారణాలా లేక ఉద్దేశ్యపూర్వకంగానే తన సహజ శైలికి భిన్నంగా ప్రసంగించారా.. అనే చర్చ ప్రజల్లో జోరుగా జరుగుతోంది. మొత్తానికి సభ సక్సెస్ అయినప్పటికి, గులాబీ బాస్ స్పీచ్‌లో వేడి తగ్గిందనే చర్చ మాత్రం అటు ప్రజల్లోనూ.. ఇటు ఆపార్టీ శ్రేణుల్లోనూ వ్యక్తమవడం గమనార్హం.

ఏ ఒక్కరికి దక్కని మాట్లాడే ఛాన్స్..

పాతికేళ్ల గులాబీ ప్రస్థానంలో తమ నేతల పాత్రను కూడా చెప్పుకునే అవకాశం రాలేదనే చర్చ జరుగుతోంది. మధ్యాహ్నం 2గంటల నుంచి సభకు జనం రావటం ప్రారంభించారు. కేటీఆర్ సాయంత్రం 4గంటల ప్రాంతంలో సభావేదిక వద్దకు రాగా, కేసీఆర్ 5.45లకు సభాప్రాంగణానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. సుమారు గంట సేపు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గదిలో విశ్రాంతి తీసుకున్నారు. ఈ లోపు తెలంగాణ ఉద్యమ వీడియో పాటలను ఎల్‌ఈడీ స్క్రీన్‌లల్లో ప్లే చేశారు. అంతకు ముందు రసమయి బాలకిషన్ బృందం ఆటపాటలతో జోష్ నింపారు. అయితే వేదికపై తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేసిన అనేక మంది ఆసీనులయ్యారు. ప్రధానంగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీ్‌షరావు, జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సిరికొండ మధుసూదనాచారి, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీ కవిత, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వినయ్‌భాస్కర్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్‌రావు తదితర నేతలు అనేక మంది వేదికపై ఉన్నారు. అయినా 25ఏళ్ల సుదీర్ఘ యాత్ర గురించి మాట్లాడే అవకాశం ఏ ఒక్కరికి ఇవ్వకపోవటం కార్యకర్తల్లో చర్చకు దారిసింది. వరంగల్ గడ్డపై సభ జరుగుతున్న నేపథ్యంలో టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, బీసీ నేత సిరికొండ మధుసూదనాచారికైనా లేదా సుదీర్ఘకాలం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేయటంతో పాటు జడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా సేవలందించిన పెద్ది సుదర్శన్‌రెడ్డిలలో ఒకరికైనా 25ఏళ్ల బీఆర్ఎస్ చరిత్రపై మాట్లాడే అవకాశం ఇవ్వాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక స్వాగతోపన్యాసం చేసే అవకాశం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్‌కు కాకుండా.. కేసీఆరే స్వయంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఇవ్వడం గులాబీ శ్రేణుల్లో హాట్‌టాపిక్‌గా మారింది.



సభ ఏర్పాట్లు బాగా చేశారంటూ పెద్ది సుదర్శన్‌రెడ్డిని అభినందిస్తున్న హరీ్‌షరావు, కేటీఆర్

ఇంకెప్పుడు పూర్తయ్యేను ?

- మరో 17 రోజుల్లో సరస్వతీ పుష్కరాలు
- కాళేశ్వరంలో ఎక్కడి అభివృద్ధి పనులు అక్కడే
- రూ.25 కోట్లు మంజూరు చేసినా ఫలితం శూన్యం



పుష్కరఘాట్ వద్ద అసంపూర్తిగా ఉన్న స్నానపు గదుల పనులు

మహదేవపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల పనులు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 25కోట్లు మంజూరు చేసినా ఫలితం కనిపించడం లేదు. అబివృద్ధి పనులు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతి పుష్కరాలకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం, రూ.25 కోట్లు మంజూరు చేసింది. మరో 17రోజుల్లో పుష్కరాలు రానుండగా.. ఈ లోపు పనులు ఎలా పూర్తవుతాయో అర్థం కాని పరిస్థితి ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఇంజనీరింగ్ అధికారులు అసలు పట్టించుకోకపోవడంతో ఈ ఈ పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీఐపీ ఘాట్ వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మెట్లను పెంచే పనులు అసంపూర్తిగానే ఉండటం, బాత్ రూంలు, స్నానపు గదులు, శారదమండపం, సరస్వతి మాత విగ్రహ పనులు ఇప్పటివరకు 20 శాతం కూడా పూర్తి కాలేదు. దాంతో పాటు ప్రధాన పుష్కర ఘాట్ వద్ద కేశ ఖండన, మహిళలు చీరలు మార్చుకోవడానికి ప్రభుత్వం టాయిలెట్లు, బాత్ రూంలను మంజూరు చేయగా ఇప్పటివరకు పునాదులకే పరిమితమయ్యాయి. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా దాదాపు 30 నుంచి 40 లక్షల రూపాయలతో టాయిలెట్లు, బాత్ రూంలు పూర్తవ్వాలనేది ప్రభుత్వ నిర్ణయం.. కానీ ఆ పనులు ఇంతవరకు పునాదులకే పరిమితమయ్యాయి. వీఐపీ ఘాట్లతో పాటు గోదావరి వద్ద ఆర్చి గేటు పనులు 10 శాతం కూడా కాకపోవడంతో, మట్టి కుప్పలుగా పోయడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలపై హైదరాబాద్‌లో, భూపాలపల్లి కలెక్టరేట్, కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సమీక్షలు, సమావేశాలు నిర్వహించడం తప్ప కాంట్రక్టర్లతో పనులు చేయించడంపై దృష్టి పెట్టలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోనే దక్షిణ కాశిగా పేరుగాంచిన కాళేశ్వరాలయం వద్ద మూడు నదుల సంగమం ఉన్న నేపథ్యంలో సరస్వతీ పుష్కరాలకు ప్రాధాన్యం ఉన్న క్రమంలో పనుల పూర్తిపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టకపోవడం, ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడి తీసుకురాలేపోవడం కారణంగా కాంట్రాక్టర్లు కూడా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. నిత్యం 50నుంచి లక్ష మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తుంటే ఎక్కడ చూసినా కంకర కుప్పలు, ఇసుక కుప్పలే దర్శనమిస్తున్నాయి. గోదావరికి వెళ్లాలంటే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికార యంత్రాంగం సమావేశాలతోనే కాలయాపన చేస్తుండడం గమనార్హం. రూ.25కోట్ల పనులతో ఈ ప్రాంతం దశ మారుతుందనుకుంటే పనులు నత్తనడకన సాగుతున్నాయి. పుష్కరాలు కేవలం 17 రోజులే ఉండడంతో రోడ్లు తప్పా ఇంకేమి పనులు పూర్తి కాలేదని గ్రామ ప్రజలు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇంకా పూర్తి కాని మెట్ల పనులు

రాతి నుంచి సంగీతం

- అరుదైన నవీనయుగం నాటి శిల లభ్యం
- వెల్లడించిన పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి



← రాతిని కొట్టి శబ్దాన్ని వినిపిస్తున్న రత్నాకర్‌రెడ్డి

నర్మెట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా నర్మెట మండలం బొమ్మకూరులో నవీన శిలాయుగం నాటి సంగీతం వినిపించే అరుదైన రాతి కళాఖండాన్ని చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బొమ్మకూరులో ఓ రైతు పొలం దున్నుతుండగా మూడు రోజుల క్రితం ఈ అరుదైన శిల దొరికిందని, దానిని పరిశీలించగా సంగీతంలా వినూత్న శబ్దం వస్తోందని వెల్లడించారు. 15 కిలోల బరువున్న రాయిపై ఏదైనా రాయితో కొట్టినప్పుడు గంట కొట్టిన శబ్దం వస్తోందని తెలిపారు. ఇలాంటి శబ్దాలు రావడం అరుదైన విషయమన్నారు. దొరికిన రాయితో నాటి ప్రజలు ధాన్యాన్ని నూరడం, దంచడం లాంటివి చేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడించారు. బొమ్మకూరు చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని, జిల్లాలోనే అతి పెద్ద ఇనుము లోహ పరిశ్రమ గతంలో ఇక్కడ విలసిల్లిందన్నారు. చారిత్రక సంపదను వివిధ రాష్ట్రాల పరిశోధకులే కాకుండా ఇంగ్లండ్, ఇటలీకి చెందిన పరిశోధకులు గ్రామానికి వచ్చారన్నారు. జిల్లాలో ఉన్న పురావస్తు చరిత్ర ఆధారాలు, శిల్పాల భద్రతకు మ్యూజియం ఏర్పాటుకు కృషి చేయాలని రత్నాకర్‌రెడ్డి కోరారు.

కేసీఆర్‌ను జనం మరిచిపోయారు..

- ఉనికి కోసమే కాంగ్రెస్‌పై విమర్శలు
- సభకు రెండు లక్షల మంది కూడా రాలేదు
- వరంగల్ నగరాభివృద్ధికి బీఆర్ఎస్ చేసిందేం లేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి, కడియం, మాజీ మేయర్ స్వర్ణ

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జనం మరిచిపోయారని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఉనికి కో సం రజతోత్సవ సభలో కాంగ్రెస్‌పై విమర్శలు చేశారని, కాంగ్రెస్‌ను విమర్శిస్తేనే కేసీఆర్‌కు బతుకు అని మండిప డ్డారు. సోమవారం హనుమకొండలోని కాం గ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, పదేళ్ల పాలనలో వారు ప్రజలకు చేయలేని మేలు.. 16 నెలల కాలంలోనే తమ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. సన్నబియ్యం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలు కేసీఆర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కొల్లగొట్టిన డబ్బులతో సభలు నిర్వహించి ఉనికిని చాటుకునేందుకు తంటాలు పడతున్నారని ఎద్దేవా చేశారు. రజతోత్సవ సభలో వేదికపై కేసీఆర్, కేటీఆర్ ఫొటోలే తప్ప ఆచార్య జయశంకర్ లాంటి ఉద్యమకారుల ఫొటోలు లేవని విమర్శించారు. మాజీ మంత్రి హరీ్‌శరావు కమ్మ కూ డా చినిగిపోయిందన్నారు. కగార్ ఆపరేషన్ ప్రస్తావనను అప్పటికప్పుడే కేసీఆర్ సభలో తీసుకొచ్చారని దుయ్యబట్టారు. వరంగల్ నగరాభివృద్ధి కోసం బీఆర్ఎస్ చేసిందేమిటని ప్ర శ్నించారు. అభివృద్ధి చేస్తే కదా సభలో ప్రస్తావించేది అని దుయ్యబట్టారు. సభకు రెండు లక్షల జనం కూడా రాలేదని విమర్శించారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లా డుతూ తెలంగాణకు కాంగ్రెస్సే విలన్ అంటు న్న కేసీఆర్ అధినేత్రి సోనియా గాంధీ కాళ్లు పట్టుకొని ఎందుకు మొక్కాడని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా ఎంతో బాధ్యతగా సభలో మాట్లాడతాడని ఆశిస్తే అబద్ధాల ప్రసంగం చేశారని మండిపడ్డారు. కాపలా కుక్కలా ఉంటానన్న కేసీఆర్ తోడేళ్లుగా మారారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులమయంగా చేశారన్నారు. బీఆర్ఎస్ ఉన్న 38 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ప్రజా తీర్పు కోరాలని రేవూరి సవాల్ విసిరారు. సగం మంది తిరిగి ఎమ్మెల్యేలుగా గెలిచినా బీఆర్ఎస్‌ను తాము ఒప్పుకుంటామని స్పష్టం చేశారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కగార్ ఆపరేషన్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలన్నారు. టెర్రరిస్టులు, మావోయిస్టుల దృక్పథం ఒకటి కాదని ఈ క్రమంలో ఇద్దరినీ ఒకే కోణంలో చూడరాదని సూచించారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో కూడా అణచివేత చర్యలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. ధర్నా చౌక్‌నే ఎత్తి వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని శ్రీహరి మండిపడ్డారు. కగార్‌ను నిలిపివేయాలనే కేసీఆర్ డిమాండ్‌లో నిజాయితీ లేదని ఆరోపించారు. కేసీఆర్ అవినీతి పాలన వల్ల 20 మంది ఐఏఎస్, ఐపీయస్‌ల్లో కొందరు విదేశాలకు వెళ్లగా మరి కొందరు జైలు పాలయ్యారని, ఇంకొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రజతోత్సవ సభ క్రమంలో కేసీఆర్‌కు బ్రీత్ అనలైజ్ టెస్ట్ చేస్తే వాస్తవాలు బయటపడేవని ఆరోపించారు. దేశంలోని రాజకీయ నేతల్లో అత్యంత సంపన్నుడు కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులేనని ఆరోపించారు. లిక్కర్ స్కాం మొదలు చేయని దందా లేదన్నారు. కాళేశ్వరం అక్రమాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని కేసీఆర్ బండారం బయటపడుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. 16 నెలల పాలనలో కాంగ్రెస్ చేసిన మేలేంటో ప్రజలకు తెలుసని, కార్పొరేషన్ ఎన్నికల్లో 400 శిలాఫలకాలు వేసి చేతులు దులుపేసుకున్న బీఆర్ఎస్‌కు సిగ్గు అనిపించడం లేదా అని మండిపడ్డారు. కాళేశ్వరం ద్వారా దోచిన డబ్బులు ఖర్చు పెట్టి సభలు పెడుతున్నారని విమర్శించారు. సభలతో తమకేమీ అభ్యంతరం లేదని కాంగ్రెస్‌ను విమర్శిస్తేనే సహించేది లేదన్నారు. సభ అయిపోయిందిగా.. ఇక ఫామ్ హౌజ్‌కు వెళ్లి తలదాచుకోమంటూ ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల టీపీసీసీ పరిశీలకులు కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్, అమీర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర, ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ నాయకులు కత్తి వెంకటస్వామి, కూచన రవళి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, దొమ్మాటి సాంబయ్య, మోజెస్ ఆనంద్, ధన్వం తి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మీసాల ప్రకాశ్ తదితర నాయకులు పాల్గొన్నారు.


నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

భద్రకాళి ఆలయంలో మే 10 వరకు వేడుకలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ప్రజల ఆరాధ్య దేవత భద్రకాళి అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 29 నుంచి మే 10వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. సోమవారం ఈవో కార్యాలయం వద్ద వారు వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భద్రకాళి శేషు మాట్లాడుతూ.. 12 రోజుల పాటు కొనసాగే ఈ వేడుకల్లో ఉదయం, సాయంత్రం వాహన సేవలు, నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలు, పారాయణాలు, ప్రత్యేక పూజలు, నైవేద్య నివేదనలు, మహా మంగళహారతులు, అన్నదాన వితరణలు కొనసాగుతాయని తెలిపారు. మొదటి రోజు మున్నూరు కాపు, రెండో రోజు ముదిరాజు సంఘం, మూడో రోజు ఆర్యవైశ్య సంఘం, నాలుగో రోజు కమ్మ సంఘం, ఐదో రోజు సగర సంక్షేమ సంఘం, ఆరో రోజు విశ్వబ్రాహ్మణ సంఘం, ఏడో రోజు పద్మశాలీ సంఘం, ఎనిమిదో రోజు నాయీ బ్రాహ్మణ, తొమ్మిదో రోజు పెరుక సంఘం, పదో రోజు కుమ్మరి సంఘం, పదకొండో రోజు గౌడ సంఘం వారు పూజలు చేస్తారని, పన్నెండో రోజు శ్రీచక్ర స్నానంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయని తెలిపారు. ఈవో శేషు భారతి మాట్లాడుతూ.. భక్తుల కోసం తాగునీటి వసతితో పాటు చలువ పందిళ్లు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, దేవస్థానం పీఆర్వో శ్యామ్, అర్చకులు చెప్పల నాగరాజు శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు, సిబ్బంది



దళారులే దిక్కు!



కల్లంలో ఆరబోసిన ధాన్యం

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు
- నిస్సహాయ స్థితిలో అన్నదాతలు
- చేసేదేమీలేక ప్రైవేటు వ్యక్తులకు విక్రయం
- తరుగు పేరిట మోసపోతున్న వైనం

ములుగు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయం రైతన్నలకు సమస్యాత్మకంగా మారింది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అనేక కొర్రీలు పెడుతుండటంతో అన్నదాతలు నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చివరకు చేసేదేమీ లేక చాలా మంది దళారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు మిల్లర్లే ఈ వ్యవస్థను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లు, పలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు లోపాయికారి ఒప్పందం చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు పెట్టిన కొర్రీలతో తమ ధాన్యం అమ్ముడుపోతుందో లేదోనని అనుమానంతో రైతులు సతమతమవుతున్నారు. దీంతో ఇదే అదునుగా భావించి దళారులు వారిని వంచిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరను తాము చెల్లిస్తామంటూ నమ్మబలికి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు 6కిలోల నుంచి 10 కిలోలు వరకు తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారు.

55,100 ఎకరాల్లో వరి సాగు

ములుగు జిల్లాలో 56,100 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి జిల్లాలో వరి సాగు గణనీయంగా పెరిగిందని అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 50 శాతం కోతలు ఇప్పటికే పూర్తయినట్టు తెలిపారు. ఈ సీజన్‌లో 92.11 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 150 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే .. అనేక కొర్రీలు పెడుతూ ధాన్యం కొనుగోలుకు విముఖత చూపడంతో రైతులు చేసేదేమీ లేక ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 150 కొనుగోలు కేంద్రాలు

రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు అధికారులు జిల్లా వ్యాప్తంగా 150 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 56 ఐకేపీ సెంటర్లు, 76 పీఏసీఎస్ సెంటర్లు, 11 జీసీసీ కేంద్రాలు, 7 ఎఫ్‌పీవో కేంద్రాలు ఉన్నాయి. అయితే.. ఒకవైపు రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేం ద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని అమ్మాలని అధికారులు సూచి స్తుండగా మరోవైపు పలు సెం టర్లలో అందుకు అనువుగా పరి స్థితులు లేవని తెలుస్తోంది. కొనుకోలులో అనేక కొర్రీలు పెడుతుండటంతో అనేక మంది రైతన్నలు దిక్కుతోచని స్థితిలో దళారులే ఆశ్రయించాల్సి వస్తోంది.



వడ్లను ట్రాక్టర్‌లో నింపుతున్న యంత్రం

కనీస సౌకర్యాలు కరువు

జిల్లాలో 150 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా వాటి వద్ద కనీస సౌకర్యాలు సమకూర్చలేదనే విమర్శలు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీళ్లు, నీడ కోసం టెంట్లు, వర్షం వస్తే వడ్ల బస్తాల మీద కప్పేందుకు టార్పాలీన్లు, వడ్లు తూర్పాల పట్టేందుకు యంత్రాలు సరిగా లేవని రైతులు అంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పందులు, కుక్కలు, పశువుల నుంచి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా నిర్వాహకులు అవేమీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల పేరుతో నిరాకరణ

రైతులు పండించిన ధన్యం కొనుగోలు చేసేందుకు తేమ 17 శాతం, చెత్త, తాలు 1 శాతం, మట్టి పెడ్డలు, రాళ్లు 1 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5శాతం పూర్తిగా తయారుకాని, ముడుచుకుపోయిన ధాన్యం 3శాతం, తక్కువ రకాల మిశ్రమం 6 శాతానికి మించి ఉండరాదనే నిబంధనలు ఉన్నాయి. అయితే.. రైతులు ధాన్యపు బస్తాలు తీసుకెళ్లగా కొనుగోలు కేంద్రాల వద్ద అనేక సాకులు చెబుతూ నిరాకరిస్తున్నారని రైతులు అంటున్నారు. దీంతో అదే అదునుగా భావించిన కొందరు దళారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ధాన్యం కొనుగోలు చేస్తూ తరుగు పేరుతో మోసం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చెల్లని చెక్కులతో మోసం!

గత సంవత్సరం డిసెంబరులో తాడ్వాయి మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతుల ధ్యానం వర్షాలకు తడిసింది. ఈ క్రమంలో ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లగా కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తాను దాన్ని కొనుగోలు చేస్తానని రైతులను నిమ్మించాడు. అతడు చెప్పిన మాటలు నమ్మిన 15 మంది రైతులు 1050 క్వింటాల తడిసిన ధాన్యంతో పాటు పొడి ధాన్యాన్ని అతనికి ఇచ్చేశారు. అందుకు దళారీ క్వింటాల్‌కు రూ. 18,00 నుంచి రూ. 2,100 వరకు ఖరీదుతో కొనుగోలు చేశాడు. మొత్తం ధాన్యం డబ్బులు రూ. 18లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ. 3లక్షలు కొనుగోలు సమయంలో ఇచ్చాడని, మిగుతా సొమ్ముకు చెల్లని చెక్కులు అందించి మోసపోయామని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలి

అధికారులతో కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన మండల స్థాయి వెరిఫికేషన్ ఆఫీసర్లతో ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సమావేశమయ్యారు. జిల్లాలోని ప్రతి మండలంలో నలుగురు అధికారులను వెరిఫికేషన్ ఆఫీసర్లుగా నియమించినట్టు తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటివరకు ఇందిరమ్మ కమిటీ సభ్యులతోపాటు ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారని, ఇప్పుడు మండలస్థాయిలో వెరిఫికేషన్ ఆఫీసర్లు పరిశీలిస్తారని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమర్పించిన వివరాలు రాష్ట్రస్థాయిలో పరిశీలనలో ఉన్నాయని, మూడు కేటగిరీల జాబితాను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు అర్హుల జాబితాను పరిశీలిస్తారని అన్నారు. వారి వివరాలను నమోదు చేయాలన్నారు. ఈపథకానికి రేషన్‌కార్డు తప్పనిసరికాదని, దీనిపై ప్రభుత్వ మార్గదర్శకాలు ఇంకా రాలేదని అన్నారు. లబ్ధిదారులు బీపీఎల్ అయి ఉంటే చాలని, లబ్ధిదారుల ఎంపికలో వెరిఫికేషన్ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. వెరిఫికేషన్ లిస్టులో ఉన్న వాటి వివరాలను నమోదు చేయాలని, ఏమైనా సందేహాలు ఉంటే రిమార్క్స్ కాలంలో నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని, అధికారులు ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే ఎంపీడీవో, హౌసింగ్ పీడీల ద్వారా అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఇళ్ల వెరిఫికేషన్ సమయంలో చుట్టుపక్కల వారిని కూడా అడిగి సరిగా నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన అత్యంత నిరుపేదలు, అసలు ఇల్లు లేని వారిని ఎంపిక చేయాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం అర్హుల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సూర్యనారాయణ, ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈడీఎం దేవేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరగగా ఆయన ప్రజల నుంచి 53 వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే దరఖాస్తుదారుడికి తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్రెగుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్

వెంకటాపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. ఏడు రోజులుగా కేంద్ర బలగాలు కర్రెగుట్ట అడవులను తమ ఆధీనంలోకి తీసుకొని మావోయిస్టుల కోసం అన్వేషిస్తున్నారు. వేలాది కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను నిరం తరంగా చేపడుతున్నారు. సుమారు వెయ్యి మంది మావోయిస్టులు కర్రెగుట్టల్లోని సొరంగాలలో ఉన్నారనే సమాచారం మేరకు కూబింగ్ బలగాలు ఆ దిశగా వేట కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారని ఛత్తీస్‌గఢ్ పోలీసులు ధ్రువీకరించారు.

కర్రెగుట్టల చుట్టూ మావోయిస్టులు భారీగా మందు పాతరలు అమర్చడంతో కూంబింగ్ ఆపరేషన్ ఆలస్యమవుతోందని తెలుస్తోంది. మావోయిస్టులు అమర్చిన సుమారు 100కు పైగా బాం బులను కేంద్ర బలగాలు నిర్వీర్యం చేసినట్లు సమాచారం. మావో యిస్టులు బీరు బాంబులను సైతం అమర్చగా వాటిని చూసిన కేంద్ర బలగాలు ఆశ్చర్యం వ్యక్తం పరుస్తున్నట్లు తెలు స్తోంది. కర్రెగుట్టల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుం డటంతో కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశాయి. ఇది ఇలా ఉండగా కర్రెగుట్టల్లో కూం బింగ్‌ను ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ప్రకటనలు విడుదల చేశాయి.



కూంబింగ్‌లో బలగాలు

దేవాలయానికి సీసీ కెమెరాలు వితరణ

రేగొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన ఏడునూతుల సీతారాంరెడ్డి రూ.40 వేల విలువగల ఐదు సీసీ కెమెరాలు వితరణ చేశారు. వీటిని సోమవారం గ్రామస్థుల సమక్షంలో ఆలయం చుట్టూ ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు గుడికి దారి తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడానికి రూ.10 వేలు అందజేస్తున్నానన్నారు. తమ పూర్వీకులు నిర్మించిన ఈ ఆలయాన్ని భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా, అభివృద్ధి చేయడంలో సహకారం అందిస్తానన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

మల్హర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ఐక్య రాజ్యసమితి 2025ను సహకార సంవత్సరంగా గుర్తించి సందర్భంగా మండల కేంద్రమైన తాడిచర్లలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీఏసీఎస్ కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ వరకు ఇది కొనసాగింది. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ ఇప్ప మొండయ్య, వైస్ చైర్మన్ సూర్య ప్రకాశ్‌రావు, డైరెక్టర్లు వొన్న తిరుపతిరావు, సంగెం రమేష్, మాచర్ల సురేష్, సర్వనాయక్, సుంకు రామన్న, కో ఆప్షన్ సభ్యులు కటకం శ్రీనివాస్, రాజయ్య, బ్యాంకు మేనేజర్ వెంకటరాజం, సీఈవో సంతోష్, సంఘం సభ్యులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘సహకార’ సేవలకు కొత్త రూపు

(5వ పేజీ తరువాయి)

వ్యవస్థ బలోపేతం కావడమే లక్ష్యంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని చిన్న, సన్నకారు రైతులకు మరింతగా మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా గతంలో జరుగుతున్న కార్యకలాపాలకు అదనంగా మరిన్ని కార్యకలాపాలు జోడించి రైతులకు ప్రయోజనం కలిగించడమే దీని ముఖ్యోద్దేశం.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్చడంతో ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయని సహకార శాఖ అధికారులు అంటున్నారు. ఎఫ్‌పీవోల ద్వారా చిన్న, సన్నకారు రైతుల సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు పడనున్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా వ్యవసాయ పనిముట్లను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచడం, పంట ఉత్పత్తులకు అధిక ఆదాయం లభించేలా అగ్రి మార్కెటింగ్ చేయడం, అధిక ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించడం, విత్తనోత్పత్తిని ప్రోత్సహించడం వంటి కార్యకలాపాలు జరుగుతున్నాయి. రైతులు తాము పండించిన పంటలకు మద్దతు ధరలు లభించేలా చేసుకోవచ్చు. పంట ఉత్పత్తుల డిమాండ్‌ను బట్టి సరఫరా చేయడానికి ఆస్కారం ఉంటుంది. ఇతర సేవలను సమర్థంగా అందిపుచ్చుకోవడానికి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) అన్ని రకాలుగా సాయం అందిస్తోంది.

నిధుల కేటాయింపు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఎఫ్‌పీవోలుగా మార్చడంతో పాటు వాటిని మరింత బలోపేతం చేయడానికి కేంద్రం నిధులను కేటాయించనుంది. ఎఫ్‌పీవోగా మారిన పీఏసీఎస్ సభ్యులకు రూ.15లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ మంజూరవుతుంది. ఎఫ్‌పీవోలు బలంగా నిలదొక్కుకోవడానికి ఏడాదికి రూ.6లక్షల చొప్పున మూడేళ్లపాటు రూ.18లక్షలు వస్తాయి. ఈ పథకానికి కేంద్రం ఎస్‌సీజీఎఫ్ (ప్రత్యేక క్రెడిట్ గ్యారెంటీ నిధి) రూ.1.500 కోట్లను కేటాయించింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఎన్‌సీడీసీ (జాతీయ సహకార అభివృద్ధి సంస్థ) ద్వారా పథకాలను అమలు చేయనున్నారు. దీంతో పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా అభివృద్ధి చేయడానికి కేంద్రం రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్‌ను సీబీబీవో (క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్)గా గుర్తించింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎఫ్‌పీవోలుగా మారడంతో మరింతగా అభివృద్ధి చెందుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రైతులను సంఘటితం చేయడమే లక్ష్యం

- వాల్యానాయక్,
జిల్లా సహకార అధికారి, భూపాలపల్లి



పీఏసీఎస్‌లకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా గుర్తింపు రావడంతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. ఎఫ్‌పీవోల ద్వారా రైతులను సంఘటి తం చేయడమే లక్ష్యం. రైతులు తాము పండించిన పంటలకు విలువ ఆధారిత ప్రోత్సాహం లభిస్తుంది. రైతులు పంట ఉత్పత్తులను అగ్రి మార్కెటింగ్ చేయడంతో పాటు ఎగుమతులు కూడా చేసుకోవచ్చు.

బుట్టాయిగూడెంలో కాంగ్రెస్ ర్యాలీ

కన్నాయిగూడెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుట్టాయిగూడెంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎం.డి.అఫ్సర్ పాషా నేతృత్వంలో ఇది జరిగింది. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రటాలతో ర్యాలీని నిర్వహించారు. రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ బీజేపీ అవలంబిస్తున్న నియంతృత్వ పోకడలను ఎండగట్టాలన్నారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి గుడ్ల దేవేందర్, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, తాటి రాజబాబు, సుమన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే 1 నుంచి జూన్ 6 వరకు నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి తుల రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరం ప్రదేశాన్నిబట్టి గ్రామీణ ప్రాంతం వారికి ప్రాధాన్యమిస్తూ పది శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడల్లో తమ నైపుణ్యాలను తీర్చిదిద్దుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 7330326241 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఏటూరునాగారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన డొంగిరి రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు సమకూర్చిన రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జిట్ట ఈశ్వర్, కొండగొర్ల తిరుపతి, తీగల సమ్మయ్య, సోదరి రమేష్, డొంగిరి లక్ష్మణ్, గజ్జల ప్రకాశ్, దుర్గం లక్ష్మణ్, సంద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే సమ్మర్ క్యాంపు

ఏటూరునాగారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల గిరిజన జూనియర్ కళాశాలలో విద్యార్థినుల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ఏటూరునాగారం కరాటే అకాడమీ చైర్మన్, మాస్టర్ ఎమ్డీ. అబ్బు తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ములుగు జిల్లా కరాటే అధ్యక్షుడు సూర్య సహకారంతో ఈ సమ్మర్ క్యాంప్‌ను ఈనెల 27 నుంచి 30 వరకు నాలుగు రోజుల పాటు కొనసాగనుందని వివరిం చారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సౌకర్యం కూడా ఉంటుందని పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్ పనుల వల్లే విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంగపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కమలాపురం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో ఈనెల 19 నుంచి పనులు కొనసాగుతున్నాయని, దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఇన్‌చార్జి ఏఈ కృష్ణారావు తెలిపారు. ‘ఆంధ్రజ్యోతి’లో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కమలాపురం 11 కేవీ లైన్లలో పూర్తిగా అంతరాయాలు ఏర్పడకుండా మరో ఫీడర్ నుంచి సరఫరా చేయడానికి పనులు జరరుగుతున్నాయన్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెపారరు.

యాసంగిలోనూ సన్నాలకు బోనస్

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్



ఫేస్‌టుఫేస్

ఆంధ్రజ్యోతి: ధాన్యం సేకరణకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?

జిల్లా పౌరసరఫరాల అధికారి: జిల్లాలో 1.30 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనాతో 203 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. రైతుల చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తాం. సెంటర్లల్లో ప్యాడీకీనర్లు, టార్పాలీన్లు, గన్నీలను ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సన్న రకం ధాన్యం సేకరణ ఏవిధంగా చేపట్టబోతున్నారు?

జిల్లా పౌరసరఫరాల అధికారి: ఖరీఫ్‌లో చేపట్టిన విధంగానే యాసంగిలోనూ సన్న ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. జిల్లాలో ఈసారి 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంతో ముందుకు వెళ్తుండగా ఇందులో 40వేల మెట్రిక్ టన్నుల వరకు సన్నధాన్యం వచ్చే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: సన్నలకు చెల్లించే బోనస్ ఏవిధంగా చెల్లించబోతున్నారు.

జిల్లా పౌరసరఫరాల అధికారి: ప్రభుత్వ ఆదేశాలనుసారం ఈసారి కుడా సన్నలకు రూ. 500 బోనస్ చెల్లించేందుకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు ఇచ్చింది. సన్నలను ఎంట్రీ చేసేందుకు ప్రత్యేక క్యాబ్‌లను వానాకాలం లాగనే వినియోగిస్తాం. రైతులకు బోనస్ చెల్లించేందుకు డిఎస్‌కు ప్రత్యేక లాగిన్ కల్పించారు. మద్దతు ధర చెల్లించిన 2,3 రోజుల వ్యవధిలో రైతుల అకౌంట్‌లో బోనస్ ధర చెల్లిస్తాం.

ఆంధ్రజ్యోతి: రేషన్‌షాపుల్లో తనిఖీలు లేవని ఆరోపణలు ఉన్నాయి. మీరేమంటారు?

జిల్లా పౌరసరఫరాల అధికారి: జిల్లాలోని రేషన్ షాపుల్లో తనిఖీలు చేస్తున్నాం. మండల స్థాయిలోనూ తనిఖీలు చేసేందుకు ఆదేశాలు జారీ చేశాం. రేషన్ బియ్యాన్ని అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల నుంచి డెలవరీ చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నాయని వస్తున్న ఆరోపణలపై మీ చర్యలు?

జిల్లా పౌరసరఫరాల అధికారి: డెలవరీ చార్జీల వసూళ్లపై ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే గ్యాస్ సిలిండర్ ధరను చెల్లించాలి.

ఆంధ్రజ్యోతి: పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు ఉండటం లేదు.

జిల్లా పౌరసరఫరాల అధికారి: జిల్లాలోని బంకుల్లో మౌలిక సౌకర్యాల కల్పన కల్పించడంలేదని మా దృష్టికి వచ్చింది. జాయింట్‌గా తనిఖీలు చేసేందుకు ఆయిల్ కంపెనీలకు లేఖ రాశాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం కేటాయించిన ధాన్యం మిల్లర్ల వద్ద లేదనే ఆరోపణలు ఉన్నాయి. మీరేమంటారు?

జిల్లా పౌరసరఫరాల అధికారి: జిల్లాలో అటువంటి పరిస్థితి లేదు. మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలు ఉన్నాయి. తనిఖీల్లో ధాన్యంలేదని మా దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తాం

- భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

మాజీ సర్పంచ్‌కు కాంగ్రెస్ నేతల పరామర్శ

కాటారం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల ంలోని శంకరంపల్లి ఎస్సీ కాలనీలో మాజీ సర్పంచ్ భూపెల్లి రాజయ్యను కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నేతలు సోమవారం పరామర్శించారు. రాజయ్య తల్లి దుర్గమ్మ ఇటీవల మృతి చెందగా ఆయన్ను, ఆయన కుటుంబ సభ్యులను తాజా మాజీ సర్పంచ్ అంగజాల అశోక్ ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించి దశదినకర్మ కోసం నిత్యావసరాలు అందించారు. ఈ కార్యక్రమంలో బానయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడి మృతి



దేవదాసు (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుకు తండా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని దేవదాసు (38) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివ రాల ప్రకారం.. దేవదాసు కొద్ది రోజుల క్రితం అస్వస్థతకు గురి కాగా కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చేర్పిం చారు. ఈక్రమంలో దేవదాసు ఆరోగ్య పరిస్థితి విష మించి మృతిచెందారు.. మృతుడికి భార్య సృజన, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాడ్వాయి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ దైవ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మం డల కేంద్రం శివారు జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం గోపాల్ రావుపేట గ్రామానికి చెందిన గోరంట్ల శ్రీను(48) కుటుంబ సభ్యులతో దైవదర్శనం కోసం వేములవాడకు ఆటోలో బయ ల్దేరాడు. తాడ్వాయి శివారు జాతీయ రహదారిపై ఆటోను ఎదు రుగా వస్తున్న బొలేరో గూడ్స్ వాహనం ఢీకొట్టగా డ్రైవర్ పక్కన కూర్చున్న శ్రీనుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో డ్రైవర్ సహా ఆరుగురు ఉండగా శ్రీను ఒక్కడే ప్రమాదానికి గురయ్యాడు. మిగతా వారెవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడి కొడుకు గోరంట్ల శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలి

అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



వినతులు స్వీకరిస్తున్న అ.కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్జీదారులకు జావాబుదారీతనంగా పనిచేయాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ప్రజావాణిలో 34 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

జీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహాదారుగా శ్రీనివాస్

కాటారం ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహాదారుగా కాటారం గ్రామ పంచాయతీ కారోబార్ దోమల శ్రీనివాస్ నియమితులయ్యారు. కాటారంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సామల శ్రీకాంత్ నియామకపు పత్రాన్ని అందించారు. జమ్మూ కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల మారణకాండలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు.

మండల కమిటీ ఎన్నిక

గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పప్పుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బోడ రాజయ్య, ఉపాధ్యక్షురాలిగా దుర్గం రాజేశ్వరి, కోశాధికారిగా ఆత్కూరి రవి, ప్రచార కార్యదర్శిగా కొరల్ల రాజయ్య, సహాయ కార్యదర్శిగా దుంపల రాజేశ్వరిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, ఎండీ ఖాజా, జిల్లా నాయకులు శశికుమార్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.